# ముష్టి ప్రభువులు

జానకీ పతిగారు నాకు కబురంపించారు. ఆయనంటే ఎంతో యిది నాకు.

అందుకని వెంటనే వెళ్ళి ఆయన్ని కలుసుకుందామని బయల్దేరాను.

తెలుగు సాహిత్యంతో బాగా పరిచయం ఉన్న వ్యక్తి ఆయన.

దానితో నాకెంత పరిచయముందో నాతో నేను ఆలోచించుకున్నాను.

నాకు తెలుగు చదవడమూ, రాయడమూ వచ్చు.

ఇవి రెండూ వచ్చినంతర్వాత కథలు రాయకుండా పత్రికలకు పంపకుండా ఎలా ఊరుకోవడమో మాత్రం తెలీలేదు నాకు.

చదవగా చదవగా వాడే పాసౌతాడు. అన్నట్లు పంపగా పంపగా వాళ్ళే వేసుకుంటారు- వేసుకోక ఏ చెరువునీరు తాగుతారు- అన్న ధీమాతో ఆఖరికి వాళ్ళని ఓడించేశాను.

కథలు అచ్చవడమేకాదు, పేరూ వచ్చింది నాకు.

పేరు ఒకటేకాదు, డబ్బూ కొట్టుకొచ్చింది దాంతో.

డబ్బు చేతికివచ్చాక తక్కినవన్నీ బ్రాకెట్సులో ఉంచి ఎక్కువ డబ్బు ఎలా సంపాదించడమా అనే చింత కలగడం సహజం కదా...

ఏ అర్నెల్లకో ఒక కథ పడుతుంది.

ఏ పదో పాతికో ముడుతుంది.

ఇంతేనా!

పత్రికలు పెట్టినవాళ్ళు పత్రికలు అమ్ముకుంటారు. కథలు రాసేవాళ్ళు కథలు అమ్ముకుంటారు ఎవరి వ్యాపారం వారు అభివృద్ధి చేసుకోడంలో ఎక్కడ తప్పౌతుందో ఎంత ఆలోచించినా బోధపడలేదు నాకు.

ఎన్నాళ్ళూ యీ పదో పాతికతోనే తృప్తి పడవలసిందేనా?

"రావోయ్ కూర్చో" అన్నారు జానకీపతిగారు.

పేరున్న పెద్ద పెద్ద రచయితలందరూ తన శిష్యులు అని చెప్పుకుని గర్వపడుతూ ఉంటారు ఆయన. నా కథల్లో లోపాల్ని అప్పుడప్పుడు ఎత్తిచూపుతూ ఉంటారు. ఆయన విమర్శలు నాకు నచ్చవు.

ఆయన పెద్దరికం నన్ను మాట్లాడనియ్యదు.

అందుకనే ఆయన దగ్గిరున్నంతసేపూ యించుమించు నోరు విప్పను.

అదిగాక ఆయన హోదాకూడా అటువంటిది మరి.

రిటైర్డు గవర్నమెంటు ఉద్యోగి ఆయన.

ఏ పనీ చెయ్యకుండా ఇక ప్రతికున్నవాళ్లూ అయిదు వందల కరుకులు ప్రతినెలా కళ్ళజూసే అదృష్టవంతుడాయన.

ఇద్దరే కొడుకులు ఆయనకి.

కొడుకులా? మేరు పర్వతాలు వాళ్ళు!

వెయ్యేసి తక్కువకాకుండా నెలజీతాలందుకునే లక్ష్మీ పుత్రులు వాళ్ళు.

సాధారణంగా వాళ్లెవరూ తండ్రిదగ్గిర ఉండరు.

సొంత ఇల్లంతా వాటాలకింద చేసి అద్దెలకి యిచ్చు కుని, అన్ని సదుపాయాలతోనూ ఉన్న రెండుగదులభాగం తనకింద ఉంచుకున్నారు. జానకీపతిగారు. ఇంట్లో ఎప్పుడూ ఒక నౌకరూ, ఒక వంటవాడూ.

ఇంటిముందు అనేకరకాల మొక్కలుగల పెద్ద ఖాళీ జాగా - చాలా జాగ్రత్తగా పోషిస్తూ ఆయన తనకిందే ఉంచు కున్నారు.

అక్కడ అప్పుడప్పుడు సాహితీగోష్ఠులు జరపడం ఆయ నకి సరదా.

రెండేళ్ళ కిందట ఒక ఉగాది కార్యక్రమంలో నేనక్కడ ఒక కథ చదివాను. ఆ సభకి ఆయన అధ్యక్షత వహించారు.

అప్పట్నుంచీ సాహిత్యపరమైన ఏ విషయంలోనైనా సరే నేను కోరినా కోరకపోయినా సరే ఆయన నాకు అధ్య క్షత వహిస్తూ వచ్చారు.

ఇవన్నీ ఎందుకు?

ఆయనంటే నాకెంతోయిదని ముందే చెప్పానుగదా...

"మాట్లాడకుండా అలా కూచున్నావేమోయ్, మళ్ళీ ఏ కథయినా తిరిగివచ్చిందా ఏమిటి?"

"వేసుకున్నా తిరిగొచ్చినా ఒకటేలెద్దురూ ఏమిటి పెద్ద డిఫరెన్సు?" అందామనుకున్నాను. అనలేకపోయాను.

"ఏం, ఫీలైబిగా ఎంగరేజింగ్‌గా లేదా?" అవునని తల ఊపాను నేను.

"మొన్న పాతికపేజీల నీ కథ ఏమిటి దానిపేరూ 'కోటి రూపాయలు' కదూ? ఎంత పంపారేం దానికి?"

"పదిహేను" అన్నాను తలవంచుకుని.

"కనీసం కోటిపైసలయినా యిస్తే బాగుణ్ణు" అన్నారు నవ్వుతూ. నేను తెల్లబోతూ ఆయనవైపు చూశాను. కోటి పైసలంటే లక్షరూపాయలు.

"కోట్లూ లక్షలూ కాదుగాని వేలొచ్చే మార్గమొకటి చెబుతాను. చేస్తావూ?" నా గుండె దడదడలాడింది.

రెండొందల నెలజీతగాణ్ణి నేను.

అయిదుగురు పిల్లల తర్వాతైనా ఆపరేషనంటే అదోలా అనిపిస్తున్నవాణ్ణి నేను.

ఏదో పనిలో పనిగా పార్టుటైముగా నాలుగుఅక్షరాలు బరికి నాలుగురాళ్ళు చేసుకుందామని ప్రయత్నిస్తున్నాను.

అణా కాఫీ పావలా అయికూచుంది.

పదిరూపాయల పారితోషకం నలభై ఎందుకవదూ?

నాకీ రచనోద్యమం ఏమీ లాభసాటిగా లేదు.

అలాంటప్పుడు వేలుకాదు వందలంటే ఎగిరి గంతెయ్యనా?

"రాసినతర్వాత మళ్ళీ ఆలోచించవుగాని నీ తెలుగు చాలా బాగుంటుందోయ్" అన్నారు జానకీపతిగారు నేనేం మాట్లాడకముందే.

"ఇదిగో మొన్ననే వచ్చింది. ఈ ఉత్తరం సరిగ్గా చదువుకో" అంటూ ఒక వైపు ఉత్తరం నాముందుకి తోశారు.

ఆ సభలో మాట్లాడమనీ యీ సభలో బహుమానాలు పంచిపెట్టడానికి రమ్మనమనీ, ఏదో కొత్తపత్రిక ఆవిష్కరించమనీ ఏవేవో ఆహ్వానాలు అలా ఆయనకి వస్తూనే వుంటాయి. వచ్చిన ప్రతిదీ నాకు చూపిస్తూ ఉంటారు. చూసి చూడకుండానే 'బాగుంది బాగుంది' అని పాస్ చెయ్యడం నాకు అలవాటు.

ఆ కాగితాన్ని అటూ ఇటూ తిప్పి బాగుంది, బాగుంది-అన్నాను.

"ఏమిటి బాగుంది నీ మొహం? సిరిరా మోకాలొడ్డడం అంటె ఇదే కాబోలు" కానియ్యి ఎవరి ఖర్మకి ఎవరేం చేస్తారు.

'ఆ కాయితం ఇలా ఇచ్చెయ్యి' అన్నారు.

"సారీ, నేనేదో పరధ్యానంగా అన్నాను" అంటూ దాన్లోని మంచి చెడ్డలు అప్పుడు పరిశీలించాను.

తెలుగు సమితి. విజయవాడ నుంచి వచ్చింది ఆ ఉత్తరం. ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న ఒక సాహితీ సంస్థ అది. ఏటా ఏవో కొన్ని తెలుగు పుస్తకాలు ప్రచురిస్తూ ఉంటారుట వాళ్ళు, ఇదివరకే ఎప్పుడో అప్పుడు యీ మహానుభావుడే చెప్పినట్టు జ్ఞాపకం. ఆ ఏడు ఏదో పుస్తకాన్ని ఇంగ్లీషునుంచి అన్ని భాషలలోకి అనువదించాలని కేంద్రసమితి నిశ్చయించి ఆ బాధ్యతని తెలుగు సమితికి అప్ప

జెప్పారుట. తెలుగు సమితివారు ఆ భారం జానకీపతిమీద పెట్టారు.

"మీ పేర ఇంగ్లీషు పుస్తకం పంపించాం. సమర్థుడైన ఎవడిచేతనైనా యీ పుస్తకం చిక్కటి వ్యావహారిక తెలుగు లోకి అనువదింపజేసే మహత్తర బాధ్యత మీది" అనిరాశారు సమితివాళ్ళు.

"చూశావ్రటోయ్, నామీద వీళ్ళకి ఎంత నమ్మక మోను... ఇలాంటివి ఇంకా ఇంకా చేపట్టి భాషాసేవ చెయ్య డానికి పాండిత్యముందా, వయస్సు ఉందా నాకు?"

"అమ్మమ్మ, ఎంతమాట." అనడం తప్పలేదు నాకు.

"ఇంత పెద్ద పుస్తకం ట్రాన్స్లేట్ చెయ్యగలవుటోయ్ నువ్వు?" అన్నారు ఆయన వెయ్యి పేజీలు పెద్దపుస్తకాన్నొ కటి నా ముందుకి తోస్తూ.

"ది బయాగ్రఫీ ఆఫ్ స్వామీ క్రోధానంద" అని చది వాను.

"ఎవరండీ యీ క్రోధానంద ఎక్కడా వినలేదే!" అని అడుగుదామనుకున్నానుగాని ఆభిజాత్యం అడ్డొచ్చింది. అన్ని భారత భాషలలోకీ అనువదించదగిన తాహతుగల ఒక ఇంగ్లీషు పుస్తకాన్ని ఒక ప్రఖ్యాత రచయిత చదవలేదంటే యెంత చిన్నతనం?

"ఈయనగురించి పాతికేళ్ళ క్రిందే సమగ్రంగా విన్నా ననుకో... మహామభావుడు! ఎంత అలాంటివాడూ, ఎంత ఇలాంటి వాడూ! పది పదిహేను పుస్తకాలయినా చదివి ఉంటాను. అయితేనేం, ఒరిజనల్ చదివే అదృష్టం ఇన్నా

ళ్ళకిగాని కలగలేదు... ఏవిటలా చూస్తున్నావ్? ఇదంతా చది వానని నీకు నమ్మకంలేదు కదూ? ఏం చెయ్యనూ? మా అంచనా అంతే...నిన్న ఉదయం పోస్టులో వచ్చిందా, ఇది అలా పట్టుకు కూచున్నాను అంతే ఇక నీళ్లు లేవు, అన్నం లేదు.

ఇంకా ఏమేమో చెప్పుకుపోతున్నారు ఆయన. కొంత సేపు అయాక నేను గుర్తించడంలేదని గమనించి.

"ఆ అట్టమీద బొమ్మ చూశావా" చాలా బాగుంది కదూ! ఎవడో భక్తుడు తన్మయత్వంలో కళ్ళు మూసుకుని నమస్కరిస్తున్నట్టుంది. అదే తెలుగు పుస్తకానికి వెయ్యమని నేను రాయదల్చుకున్నాను. నీ అభిప్రాయం ఏమిటి ?"

నాలాంటివాళ్ళకి నోటితో చెప్పే అభిప్రాయమంటూ ఏముంటుంది! గంగిరెద్దులా బుర్ర ఊపాను కాని మనస్సులో అనుకున్నాను :

"ఈ పుస్తకం రాసినవారికీ చదివినవాడికీ పదివేళ్లూ జోడించవచ్చు... చాలా భావస్ఫోరకంగానే ఉంది ముఖ చిత్రం"

"నిజంగా ప్రతీ లైబ్రరీలోను ఉండదిగ్గ పుస్తకమోయ్ యిదీ."

అవును లైబ్రరీలో మాత్రమే ఉండదగ్గ పుస్తకాలు చాలా తయారవుతున్నాయి మరి, హృదయాలలో చోటు లేదు వాటికి. లోపలి అచ్చూ పై పెచ్చూ చాలా బాగుం టాయి. ఎంత పెద్ద అరలయినా నాలుగైదుకంటె ఎక్కువ పట్టవు. వేలకు వేల పేజీలకన్న తక్కువ ఉండవు... నా

ఆలోచన అక్కడ పుటుక్కున తెగిపోయింది. వేలకి వేల పేజీలు !

ఆనందంతో పిచ్చెత్తిపోయినట్టు అయింది.

పేజీకి రూపాయి యిచ్చినా... ఒహో ఎంత మొత్తం !

కాని నా అంచనాన్ని ఎగరగొట్టేశారు జానకీపతిగారు !

ఈ అనువాదానికి పారితోషికంగా ఐదువేలు ఇస్తారుట!

ఇంకేం, ఇంకేం !

ఏ కురుపుల కాళ్ళనయినా ఏ అయోడిన్ నీళ్ళతో అయినా కడిగి యీ ఐదువేలూ యిచ్చి మా అమ్మాయిని దారపోస్తాను. ఈ కరువురోజుల్లో ఒక గుదిబండని తరలించినా అదెంత కాదు...

'కాని ...'

జానకీపతిగారు ఏం చెబుతారో అని నా గుండె ఆగిపోయింది.

"కేంద్ర సమితివారు ఒక్కొక్క భాషకి ఏడువేల ఐదు వందల చొప్పున కేటాయించారుట. అందుకని నా పేర వచ్చింది. ఐదువేలే అయినా ఏడువేల ఐదువందలు అందుకున్నట్టు నేను తెలుగు సమితికి రసీదు ఇవ్వవలసి ఉంటుంది. ఇప్పుడు సమితి సెక్రటరీ ఎవరో ఎరుగుదువు కదూ, ఇనప వ్యాపారంచేసే చిదంబర రెడ్డి."

'అయితే చిదంబర రెడ్డి జేబులో పడతాయా ఆ రెండు వేలు ...'

"ఛ ... ఎంతెంత భాషాసేవ చేస్తున్న వాళ్ళనీ ఎంత తక్కువగా ఊహిస్తావోయ్! నువ్వూ అంతేనా ? ఒక మంచి

పుస్తకం రాయించగానే సరి అనుకున్నావా? ఆ పుస్తకం ఏ సినిమాతారకో, వెంకన్న పంతులుకో ఏ పలుకుబడిగల మంత్రికో అంకితం ఇవ్వొద్దా? ఆవిష్కరణా, సభా అంటూ ఉండవా? బెజవాడలాంటి ఊళ్ళో భారీఎత్తున ఇలాంటి ఏర్పాట్లకి నిజానికి ఏడువేల ఐదువందలూ చాలవు. ఆ చిదంబరరెడ్డి సాహిత్య హృదయం ఉన్నవాడు కాబట్టి నిజంగా కష్టపడిన కవికి ..."

నిజమే, నిజమే అని అరిచేయి నాలో ప్రతి అణువూ,

చిందబరరెడ్డిలు ఇంటింటా వెలియాలి.

స్వామి క్రోధానందలు ఏటేటా పుట్టాలి.

నేను మాచంటివాణ్ణి ఎత్తుకున్నట్లు ఆ పుస్తకం అందుకున్నాను.

"అప్పుడే లేచిపోతామేమిటి కూచో కూచో పుస్తకాన్ని దించు" అన్నారు. జానకీపతిగారు.

నేను కూచోలేదు ఆయన ఆనతిని మొదటసారి తిరస్కరించాను.

ఒకచోట నిలబడలేక పోయాను కూడా ...

"చూడూ... ఇదొక పరమయోగి జీవిత చరిత్ర అంతా గూఢంగా గుహ్యంగా ఉంటుంది ... ముందు కూచోమంటే... తర్జుమా నువ్వనుకున్నంత సులువుకాదు. పైగా మూడు నెలల్లో పూర్తిచేయాలి" బజారు చీకటిగానేకాక చల్లగా ఉండి కాగితాలు సిరాదారకాలిగాని కాగితాలు నలుపు చెయ్యడం

అదో బ్రహ్మవిద్యా ? ఒకదానిమీద ఒకటి పెడితే కాగితాల మందం ముఖ్యంగాని కడుపులోని అందం ఎవడిక్కావాలి!

నిమిషాలమీద రాసి పారేస్తాను. సెకనుకి ఒకకథా రోజుకి ఒకనవలా రాసిపారేసే కవులూ, కవయిత్రులూ ఎందరు లేరు! అదిగాక యీమూఢమి వెళ్లిపోతే మళ్లీ ముహూర్తాలు ఉండవు. ఒరిజనల్‌గా రాయడానికి ఎంతో టైం పట్టదుకదా. ఆఫ్టరాల్, ఎంతపెద్ద బుక్కయితే మాత్రం ముష్టి అనువాదానికి మూడు నెలలుటండి!

"కూచోవోయ్" అని గద్దించారు ఆయన.

"ఇందులో మొదటి ఛాప్టరు రాసేసి రేపీపాటికి మీకు తీసుకొచ్చి చూపిస్తాగా... అని అక్కణ్నుంచి బయలుదేరి పోయాను.

"అది కాదోయ్ ..అసలైన ముఖ్య విషయం మీద మాటాడనే లేదు. ఆగవయ్యా అగ్నిహోత్రులూ..."

నేను ఆగదలుచుకోలేదు అగలేదుకూడా.

"సిరి రామోకాలడ్డుతారా," అని ముందు ఆయన అన్నాడా నేనన్నానా ? పుస్తకం దొరకపుచ్చుకుని పరుగుచ్చుకున్నాను అక్కణ్ణుంచి.

* * *

చెప్పకేం క్రోధానంద జీవిత చరిత్ర మొదటిఛాప్టరు నాకేం బోధపడి చావలేదు. అంతా వేదాంతమనుకునేరు, పొరపాటు ఆ యింగ్లీషు నాకేం కొరుకుడు పడలేదు. డిక్షనరీ తెచ్చుకుని ఓ పేరాగ్రాఫు అనువదించి చూశాను. గంటన్నర

పట్టింది. ఇంత టైం వేష్టు చెయ్యడం నాకు నచ్చలేదు. "లోకంలో అందరి గొప్పవాళ్ల చరిత్రా ఒకటే" అనే సత్యం నాకెంతో ధైర్యాన్నిచ్చింది అందరికీ అర్థమై చస్తే ఆయన్ని యోగి అని ఎందుకంటారు? అనే ఆలోచన నా ఉత్సాహాన్ని పెంపొందించింది. "అయినా ఒరిజనల్ రైటర్ని ఒకపుస్తకం చూసిరాసేకర్మ నాకేం?" అనుకుంటే ఎంతో తశ్శాంతి కలిగింది. ఇంతలో పావుగంటకి ఆ యింగ్లీషు పుస్తకం మంచం కింద పడి ఉంది. నామటుకు నేను యివతలి వరండాలో కుర్చీమీద కూచుని కాగితాలు శక్తికొలదీ ఖరాబు చేస్తున్నాను.

స్వామీ క్రోధానంద ఒకఉన్నత వంశంలోజన్మించారు.

ఇరవైఏళ్లు వచ్చినా ఆ ఆలు పలకలేక పోయేవాడు ఆయన.

ఏదో సందర్భంలో యిక భరించలేక తండ్రి ఆయన్ని చావగొట్టేడుట.

మొహం తిరిగి పడిపోయాడుట ఆయన.

ఆ పడిపోడం, పడిపోడం మూాన్నెళ్లు ఒళ్లెరగడట ఆయన.

ఒక ఆదివారం అమావాస్యా సూర్యగ్రహణం కలసిన పర్వదినాన కళ్లు విప్పేడుట ఆయన.

మనమాటకాదు, మన చూపుకాదు.

ఆ చూపుల్లో నిప్పులు కురుస్తున్నాయి.

చుట్టూ చూస్తున్న స్త్రీల మెడల్లోంచి చేతుల్లోంచి

చూస్తూండగా బంగారపు వస్తువులు నేలమీద ముక్క ముక్కలయి పడిపోయి మట్టిఅయి పోయాయిట।

ముట్టుకోనక్కర్లేదు, చూస్తే చాలు బంగారాన్ని మట్టి చెయ్యగల జ్ఞాని ఆయన ఆ తేడా తెలిసినవాడు యోగి కాక మరెవరు ?

ప్రజలు అందుకనే ఆయన అటువైపు వస్తే యిటువైపు కాళ్లకు బుద్ధి చెబుతారట...

ఈ విధంగా రాస్తూ స్వామీ క్రోధానంద పేరు సార్ధకం చేసి మొదటి ప్రకరణం పూర్తి చేశాను.

"ఇంత యింట్రెష్టింగ్‌గా రాసి పారేశాను గదా ఇదే ఒక షార్టు ష్టోరీగా ఏ పత్రికకో పంపిస్తేనో !" అనుకున్నాను.

అంతలో లెంపలు వాయించుకున్నాను.

బంగారం మట్టి చెయ్యడం ఏమిటి స్వామీ! మట్టిని బంగారం చెయ్యగల మహాత్ములు మీరు! అని దండం పెట్టు కున్నాను. అయిదువేలు జ్ఞాపకం వచ్చి. పెద్ద గుంటముండ గనక మొదటిదఫా ఒక కొడుకుని పెడితే స్వామి పేరు పెట్టు కోవాలి. ఎటొచ్చి కొంచెం మార్చుకోవాలి. ఒళ్లు తెలియని నిద్రపట్టేసింది ఆ రాత్రి నాకు.

* * *

మొదటి ప్రకరణం తెల్లారేసరికి మా రెంకో వాడిచేత జానకీపతిగారికి పంపించాను. సాయంకాలం అయిదున్నర అయితేగాని ఆయన్ని కలుసుకోడం పడలేదు.

"చాలా బాగా రాశావోయ్..."

ఎప్పుడూ ఆయన పూర్తిగా అభినందించడం ఉండదు. అలాంటిది !...

"లైనుబై లైను అనువదించావు. అయితేనేం దీని తల్లి వేరే ఉందని ఎవరికైనా అనిపిస్తుందా! అంత చక్కగా తీర్చి దిద్దేవు కూతుర్ని. వెల్ డన్ మూర్తీ... ఫష్టు చాప్టరు రెండు సార్లు చదివేను నేను, ఎక్కడా ఇంగ్లీషులో ... ఒక్క పాయింటు, ఒక్కటంటే ఒక్కటి మిస్ కాలేదు సుమీ నువ్వు! తెనుగుభాష మూడు పువ్వులూ ఆరుకాయలుగా వర్ధిల్లా అంటే నీలాంటివాళ్లకే అప్పజెప్పాలి!" ఏదో ఇదిగా ఉంటుంది గాని మళ్లీ ఆయనంటే మరీ అంత ఇదిలేదు నాకు అలాంటిది ఆయన నోటమ్మాట వచ్చిన ప్రతీముక్కా హరిశ్చంద్రుడి నోట్లోంచి వచ్చినట్టుంది నాకు.

"అది సరేకాని మూర్తీ..."

ఇన్నాళ్లూ నాశక్తి నేను తెలుసుకోలేక ఆయనముందు దిక్కులేని శ్రోతగా పడి ఉన్నాను. ఈ నాటికి ఉచితమైన ఉన్నతమైన స్థానం యిచ్చారు నాకు. ఇప్పుడు దింపాలంటే ఆయన తరమూ, దిగాలంటే నాతరమూ !

"ఇంక నాకు అవీ ఇవీ చెప్పకండి" అని లేచి నిలుచున్నాను.

తెల్లబోయి ఆయన నావైపు చూశారు.

"అంత గ్రంథం అంత కొద్ది కాలంలో రాయాలంటే మాటలా ?" అన్నారు.

"మునపట్లా అస్తమానూ ఇక మిమ్మల్ని కలుసు

కోడు కుదరదు. కబురంపిస్తే రాలేదం అనుకోకండి. ఇదే చెప్పడం" ఆయన చెప్పుతున్నది వినిపించుకోకుండా.

"అది కాదోయ్... ఇంకా అసలు సంగతి మాటాడు కోనే లేదు."

"ఇంక అసలు సంగతి ఏమిటి? నా దృష్టంతా క్రోధానందమీాదే ఉంది. దయచేసి నన్ను డిస్టర్బ చెయ్యవద్దు."

"ఈ ఒక్కముక్కా సెటిల్ చేసుకుందాం విను... డబ్బుమాట ..."

నాకు చిర్రెత్తుకొచ్చింది.

క్రోధానంద జీవిత చరిత్ర రాసేవాడికి ఆమాత్రం కోపం ఉండదా మరి!

'డబ్బు మాట ఏమిటండీ? మీాకయినా నాకయినా పని ముఖ్యంగాని డబ్బు ముఖ్యమా? ముందు నన్ను ఈ వర్కు ఫినిష్ చెయ్యనివ్వండి. అందాకా నా ఏకాగ్రతకి భంగం కలిగించకండి గుడ్ బై' అని గబగబా నడిచి వచ్చేశాను.

మునపట్లా చేతులు నులుపుకుంటూ గోళ్లు గిల్లుకుంటూ కూచుంటాననుకున్నాడు కాబోలు.

ఎన్ని పనులున్నాయి నాకు!

ఇంగ్లీషు పుస్తకంలోని రెండవ చాప్టర్‌లో హెడ్ లైన్సు ఎవరిచేతనయినా చెప్పించుకోవాలి. తర్వాత నా సొంత బుర్ర ఉండనే ఉంది!

* * *

ఆ మర్నాడు రాత్రి ఇంట్లో అందర్నీ ఒక్కసారి హత్య చెయ్యాలనేటంత కోపం వచ్చింది నాకు.

ఆ ఇంగ్లీషు పుస్తకం ఎక్కడా కనబడలేదు.

ఇంట్లో ఎవరైనా వచ్చినా నా గది వేరు అందులో ఏర్పాట్లు వేరు. అందులో ప్రవేశానికి ఎవరికీ పర్మిషన్ లేదు.

నా గదిలో ప్రవేశించి నేను జాగ్రత్తగా ఒకచోట పెట్టుకున్న పుస్తకాన్ని మాయం చెయ్యడానికి ఎవరికెన్ని గుండెలు !

ఓ పావుగంట వర్షం కురిసి వెలిశాక అప్పుడే ఆట నుంచి యింటికి తిరిగి వస్తున్న మా రెండో 'కులపావకుడు' అసలు సంగతి బయట పెట్టాడు.

ఫలానా పుస్తకాన్ని వెంటనే పంపించమని జానకీపతి గారు కబురు పంపించారుట. మావాడు ఆ వచ్చిన మనిషికి పుస్తకం అందించాడట.

"నేను వచ్చేదాక ఆగక్కర్లేదా ?" అని వాడికి రెండు అంటించాను. హార్మనీ ఆగిపోయిన తర్వాత వాడు మెల్లిగా మరోవార్త చెవిని వేశాడు. అవసరమైన పనుందిట, అర్జంటుగా మాట్లాడాలిట- నన్ను వెంటనే రమ్మని ఆయన కబురు పంపించాడుట.

నాకు భగ్గున వళ్లు మండింది.

ఎప్పుడుపడితే అప్పుడు ఇంటికి పరిగెత్తి దర్శనంకోసం తహతహ లాడ్డానికి నేనేం ఆయన బానిసనా, బాలికనా?

జానకీపతి ఒక్కడేకాదు. రమణమూర్తికూడా మనవే.

అంతేకాదు.

ఆయన రిటైరై కూచున్నాడు గాని పీడికింకావని ఉంది మరి !

ఆ మాటకొస్తే ఆయనపాటి సాహిత్య జ్ఞానం నాకు లేకపోలేదు.

ఆ రాత్రి నేను వాళ్ళింటికి వెళ్ళలేదు.

అయితేనేం, తెల్లవారేసరికి మళ్ళీ మనిషి ప్రత్యక్షం.

నా కోపమంతా వాడిమీద చూపించాను, వాడిమాటే వినిపించుకోలేదు. ఆ తర్వాతి రోజు- రికార్డుల్లో ఏవో తప్పులున్నాయని ఎవరో ఫిర్యాదు చేశారని—చెప్పా పెట్టకుండా మా ఆఫీసు ఆడిట్ ప్రారంభమయింది. వారం పదిరోజులపాటు మా కెవరకీ ఊపిరి సలపలేదు అసలు మా ఉద్యోగాలన్నీ ఊడిపోతాయేమో అన్నంత వరకూ వచ్చింది. ఏవో కొన్ని వార్నింగులతో ఆ ఘట్టాలు కడిలేసరికి టైఫాయడ్ వచ్చి తగ్గింత నీరసం కలిగింది మాకు.

ఇంత హడావిడిలోనూ అప్పుటప్పుడు నాకు స్వామీ క్రోధానంద జ్ఞాపకం రాకపోలేదు. "అయ్యో విశ్వ విఖ్యాతి చెందిన ఆ బాబాజీని నా చేతులతో నేను ఇరవై ఏళ్లు పెంచి యిక ఎదుగుదల అంటూ లేకుండా పదిరోజులపాటు అలా ఉంచేశానే! అని తల్లడిల్లి పోయింది సున్నితమైన నా మనస్సు.

ఉంది అంటారు గాని రచయితకి హృదయం లేనేలేదు.

బ్రహ్మదేవుడు పనిచేసి పాత్రలకు ఆయుస్సు పోస్తాడు. మంత్రసాని పనిచేసి పురుళ్లు పోస్తాడు పురోహితుడి పని చేసి నామకరణం చేస్తారు. తల్లిలా పెంచుతాడు. జబ్బుచేస్తే తనే డాక్టరై మందు కూడా తినిపిస్తాడు. అవసరమైతే తనే ప్లీడరై అతని పక్షం వాదిస్తాడు. ఇంకో ఇన్నిఅయిఇంకా ఎన్నైనా యినాచేస్తాడు. అయితేనేం, అక్కడితో ఆ పాత్రఅనవసరంఅని తోచిందో యిక అయిదునిమిషాలుఆలోచించకుండా, బెండకాచివర పిరచినంత సులువుగా పాత్రల్ని చంపేస్తాడు ...

రచయితని మించిన హంతకుడు ఈ లోకంలో ఉండడు సరే ఘోరమైన రచనలుచేసి పాఠకుల్ని చిత్రహింసకి గురిచేసే మారణకాండ వేరే విషయం.

ఏమయితేనేం మా బావాజీ అలాగే ఉండిపోయారు.

ఆయనకథ లీలగా ఊహించాను నేను. సుమారుగా ప్రయత్నిస్తున్నాను.

మొదట్లోనే భళీ అనిపించుకున్నాను :

రాసెయ్యాలి రాసెయ్యాలి... ఏమిటి ? స్వామీజీ తెలుగుకథ.

చేసెయ్యాలి చేసెయ్యాలి... అదేమిటి? పెద్దమ్మాయి పెళ్ళి.

ఆ రాత్రి ఎంత ఊహించినా ఐదు పేజీలు మించి కథ నడవలేదు.

మొదటి తొమ్మిదొందల పేజీలూ ఆయన లైఫ్ హిస్టరీ రాసేస్తే ఆఖరి వందా ఆయన నీతివాక్యాలు గుప్పించచ్చు. కాని మొదట్లోనే కథ అయిపోయినట్టు తోచి చాలా చిరాకు పడిపోయాను.

ఓసారి ఒరిజనల్ తిరగెయ్యాలనిపించింది.

అది ఇంట్లో లేకపోవడంచూసి ఆ రాత్రివేళ అందర్నీ లేపి కూచోబెట్టి తొమ్మిదిన్నర మొదలు పదకొండున్నర వరకు నాకు తెలిసిన అన్నిరకాల డాన్సు ప్రోగ్రాములూ స్వయంగా ఇచ్చేశాను. మర్నాడు ఆఫీసుకి వెళ్ళేలోగానే జానకీపతిగారిని కలుసుకుందామని నిశ్చయించుకున్నాను. వెళ్లాలని లేదుగాని వెళ్లాను మరి. అయితేనేం అంత సుళువుగా దొరుకుతారా మహానుభావులు ?

"ఇంట్లో లేరని చెప్పమన్నారు" అని లోపల్నుంచి కబురొచ్చింది.

"ఉన్నారని తెలుసు కున్నారు, కలుసుకుంటేగాని కదల నన్నారు" అని తిరిగి కబురు పంపించే ధైర్యం నాకు లేదు.

విసుక్కుంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాను.

ఆ సాయంకాలం చిన్న చీటీ పంపించారు జానకీపతిగారు

"మైడియర్ రమణమూర్తీ. పొద్దుట మా యింటికి వచ్చావుట పంతులు చెప్పాడు. నేను లేకపోయాను. అయాం సో సారీ... ఏం చెయ్యమన్నావ్, భాషాసేవ చెయ్యాలంటే లేని ఓపిక తెచ్చుకుని తిరగవలసి వస్తోంది, ఊపిరి తీసుకో డానికి టైం లేకపోతోందనుకో... ఎప్పుడో అప్పుడు తెలుగు తల్లి వడిలో రాలిపోతాను నేను. అంతకన్న కావలసిందేంటుంది.

బైదిబై నువ్వు చాలా బిజీగా కనిపిస్తున్నావు. పుస్తకం రాయడమంటే మూణ్ణిమిషాలుగాని అది అచ్చు వెయ్యడానికి చాలా టైం పడుతుంది గదా! ఈ నెలాఖరులోగానే అను వాదం అంది తీరాలని తెలుగు సమితివాళ్ళు పట్టు పట్టారు. టెలిగ్రాములమీద సాహిత్యం సరఫరా కావలసిన కాలమా మరొకటా? ఇంకో చిన్న విషయం, మళ్ళీ ఎవరితోనయినా అనేవు. నువ్వేదో నా చుట్టానివనీ నీకేదో నేను డబ్బు సాయం చేస్తున్నాననీ - అందుచేత నీకే యీపని అప్ప చెప్పే ననీ పుకార్లు బయల్దేరడమే కాదు, సమితికి కబురుకూడా వెళ్ళిందిట.

ఈ ముసలికాలంలో ఇలాంటి నిందలకి ఆస్కారం ఇవ్వడం ఎందుకు చెప్పు! ఇవన్నీ ఆలోచిస్తే యీపనికి నువ్వొలాగా ఒప్పుకోవని నాకు తెలుసు. అందుచేత స్వామీ క్రోధానంద

జీవితం అనువాదంచేసే బాధ్యత మన ఎలిమెంటరీ స్కూలు తెలుగు టీచరు శేషాచలం లేడూ, అతనికి అప్పచెప్పాను. అప్పుడే చాలావరకు పని అయిపోయింది కూడా. అదలా ఉంచు. 'సంపాతీ, జటాయువూ—వీరి పుట్టుపూర్వోత్తరాలు" అనే విషయమై భారీఎత్తున రీసెర్చి జరుగుతోంది. మొదట్లో ఆరు వాల్యూమ్సులో వేద్దామనుకున్నారుగాని తరచినకొద్దీ సరుకు బళ్ళకొద్దీ దొరుకుతోందిట. పది వాల్యూమ్స్ అవుతాయోమో అనుకుంటున్నారట. అది పూర్తవడమంటూఉంటే-నేను ప్రాయోపవేశం చేసి అయినాసరే దాన్ని తెలుగులో తీసుకువస్తాను. అప్పుడు నీకు ఎలాగా చాన్సు తప్పదు.

ఇవన్నీ నేను నీకు చెప్పే ఉందును. అసలు ఇంత ఉత్తరం ఎలా రాయగలిగానో నాకే అర్థం కావడంలేదు. టైం అన్నది నల్లపూస అయిపోయింది. ఇది పూర్తయేదాకా ఏది స్వామీజీ తెలుగుచరిత్ర నేను మళ్ళీ మనుషుల్లో పడను. ఈ నెలాఖరులోగా ఏ పరిస్థితుల్లోనూ నిన్ను కలుసుకోలేను. అది నాకెంత బాధగా ఉంటుందో నువ్వు ఊహించలేకపోవు. భాష క్షేమం దృష్ట్యా మనకీ ఎడబాటు తప్పదు.

నాతో పూర్తిగా సహకరిస్తావని నమ్ముతూ భవదియుడు జానకీపతి". అగ్ని పర్వతాలూ, భూకంపాలూ, కొండచరియలు మీద విరిగిపడడాలూ, జలప్రళయాలూ, రైలుప్రమాదాలూ,

అన్నీ ఆ క్షణం నా బుర్రలో ఉన్నాయి. గదిలో ముసుగెట్టుకు పడుకున్నాను. శెలవు చీటీ పంపించేశాను ఆఫీసుకి.

ఎంతో ఆకలివేసింది నాకు. నోటిముందు కూడు చెడి పోయిందని పిచ్చెత్తిపోయింది నాకు.

నా ఆకలీ, నా పిచ్చి "నాన్నా, అమ్మ భోజనానికి రమ్మంటోంది" అని నా గదికి వచ్చిన నా ప్రతి సంతానపు గాడిదకీ, లెంపకాయల రూపంలో బహూకరించాను.

అందరికంటె ఎక్కువ దెబ్బలు తిన్నది మా పెద్ద మ్మాయి. లేకపోతే లేనివాడి కడుపున ఆడపిల్లయి పుట్టకూడ దనీ, పుట్టినా అంత త్వరగా ఎదిగి కూచోకూడదని ఆ మాత్రం ఇంగితం ఉండొద్దటండీ!

* * *

ఆ నెలాఖరురోజుల్లో ఒకనాడు ఆఫీసు నుంచి తిరిగి వస్తూంటే శేషాచలం కలిశాడు దార్లో. పాత పురాణాల్లో కందపద్యాలు ఒక వందా, వందాఏభై లా సేకరించి ఓ పెద్ద బైండింగు బుక్కులో సిటుగా రాసుకుని దాచుకుంటాడు ఆయన. అవసరాన్నిబట్టి తలా తోకా అటూ యిటూ మార్చి ఎనిమిదికళ్ళ వాడికయినా తెలీకుండా స్వంత పద్యాల్లా చలా మణి చేయించగల హస్తలాఘవం వారికి వెన్నతోపెట్టిన విద్య. పెళ్ళి అయినా పీనుగు వెళ్ళినా సరిపోయే ద్వ్యర్థికావ్యం

ప్రచురించాడాయన అమధ్య. ఏదో ఎవార్డు కూడా ఇచ్చారని విన్నాను!

దూరంనుంచి ఆయన్ని గుర్తుపట్టి ఎంత నీచంగా ఊహించవచ్చో అంతగా ఊహించినా - కొత్తగా అంత శత్రుత్వానికి కారణం పసిగట్టి నా మనసు విలవిల్లాడింది.

స్వామీ కోథానంద జీవిత చరిత్ర—కొంతవరకు నేను తెలుగుచేసింది— అన్యాయంగా నానుంచి లాక్కున్నది ఈయన కాదా? నాకు రావలసినవి అయిదు వేలు—అయిదు వేలు—అబ్బనాడు ఎరుగుదునా, అమ్మనాడు ఎరుగుదునా— చేజిక్కించుకున్నది యీయన కాదా?

నాదాసిలో సగం జీతం కావొచ్చు, నాకు రెట్టింపు కుటుంబం ఉండొచ్చు. అయినా యీ దురాక్రమణ నేనెలా సహించేది!

తల వంచుకుని ఆయన ముందు గబ గబా నడిచి వెళ్లిపోబోయాను.

"ఏమండోయ్ రమణమూర్తిగారూ—ఎక్కడికా పరుగు? కాస్త ఆగండి"

"ఒహో మీరా, ఎవరో అనుకున్నాను" అని ఇటు తిరక్క తప్పలేదు.

"మళ్లీ యీ మధ్య ఏమైనా రాశారా?" అన్నారు నవ్వుతూ. నాకు ఒళ్లు మండింది

"ఆఁ ఈమధ్యే రెండు నవలలు పూర్తి చేశానండీ— పబ్లిషర్సు యింకా విత్తనాలు జల్లకుండానే పంటబేరం చేసి పట్టుకు పోయారు. మీ దయవల్ల ఎడ్వాన్సుగా ఓ వెయ్యి నూట పదహార్లు అందుకున్నాను" అన్నాను కసిగా.

"అలాగా? ఆ పెరుమాళ్ల దయవల్ల నాకూ యీ మధ్య బాగానే ముట్టింది. లెండి"

"వివరాలు తెలియలేదుగాని మీరేదో భాషాంతరీకరణం చేస్తున్నారని విన్నాను"

"చేస్తున్నాను అనకండి: చేసేశాను. మొన్న సాయంకాలం పూర్తిచేసి పట్టుకెళ్లి యిచ్చేశాను."

"ఇలా అడుగుతున్నానని మరోలా అనుకోకండి గాని మీకు ఇంగ్లీషు భాషలో ఏమంత పెద్ద పరిచయం లేదని వినికిడి?"

"ఆ పెద్దలు శాసించారని మేమూహూఁ భాషని నిషేధించాం గాని మేం నేర్చిన యీ చప్పన్న భాషల్లో అదొక లెక్కా?"

"భాష తెలియకుండా తర్జుమా ఎలా చేసేరండీ ఆశ్చర్యం."

"భావం గ్రహించడానికి పుస్తకమే చదవాలా ఏమిటి రమణమూర్తిగారూ, మీరింకా పెరటిదారినే ఉన్నారుగాని పాండిత్యం ఎప్పుడూ అనుక్రమంగానే వస్తుంది! చెవులకున్న శక్తి కళ్లకెక్కడిది! మహానుభావులు ఆ జానకీపతిగారు వినిపించే వారు, నేను రాసిపారేసేవాణ్ణి. అంతే ఎన్నాళ్లో అయింది పెరటిగది పడిపోయి. ఆ పెరుమాళ్ల దయవల్ల యీ అయిదు వందలలోనూ ఆగదీ. ఆ పక్కవసారా బాగయిపోతే అంతే చాలు!"

నాకు నోటమాట రాలేదు. అయిదువందలా? అయిదు వేలు కాదు! నా సందేహం పైకి వెల్లడించాను.

"బాబూ! కాగితం మీద అనేకం ఉంటాయి? అవన్నీ అలా జరుగుతాయా? అయిదువేలకి నాచేత సంతకం చేయించు కున్నారు. అయిదువందలు చేతిలో పెట్టేరు— అయిదుపదులు యిచ్చినా మరుక్షణం ఆలశ్యం చెయ్యకుండా నేను రసీదు యిచ్చి ఉందును. మా యింట్లో పరిస్థితులు మీకు తెలియనివి కావు. వారు సాహిత్య ప్రియులు. ఎన్నో విషయాలమీద ఖర్చు పెట్టవలసి ఉంటుంది. చేతిది పెట్టుకోవడం ఎంత భాగ్యవంతులకయి నా కష్టం మరి. జీవితంలో ఎప్పుడూ ఎరగను అయిదువందలు! ఒక్కసారి లెక్కపెట్టి యిచ్చారు! ఎంత వితరణశీలి ఆయన!" ఇందులో.నాపాత్ర ఏమిటో శేషాచలానికి తెలిసినట్లు లేదు. నాబుర్ర గిర్రున తిరుగుతోంది. ఇలాంటి ఎగ్రిమెంటు ఏదో ఒక దానికి రావడం కోసమేనా ఏదో ముఖ్య విషయం ఉందని జానకీపతిగారు అన్ని సార్లు నన్ను

అడిగిందీ! నాకు అయితే ఏ వెయ్యో యిచ్చి ఉండునా! ఏమో! శేషాచలం వెళ్ళిపోతూ ఒకమాట అన్నాడు.

"బాబూ, వెనక ఎన్ని ఉండనివ్వండి అయిదువందలు ఆయన నాకిచ్చింది అబద్ధం కాదుకదా! పడిపోతున్న నాలాంటి ముష్టి వెధవ యిల్లొకటి నిలబెట్టేరు అంతకన్న ఏం కావాలి!"

ఆయన వెళ్ళిపోయినా "ముష్టివెధవ" అన్న పదం నన్ను వదల్లేదు,

శేషాచలం ఆర్థిక పరిస్థితికన్నా నాది మెరుగు.

దేర్ ఫోర్ నేను అంతకన్న పెద్ద ముష్టివెధవని.

నాకు చటుక్కున జానకీపతిగారూ, చిదంబరరెడ్డి గుర్తుకొచ్చారు. నా ముఖం పువ్వు విడినట్లు. విడింది నన్ను మించిన ముష్టి ప్రభువులు లింకా లోకంనిండా నిండి ఉండడం నాకెంత గౌరవ ప్రదం!

—( * )—